కాంప్లెక్స్ పోయే.. క్లస్టర్ విధానం వచ్చే..!

- స్కూల్ కాంప్లెక్స్‌లను క్లస్టర్లుగా విలీనం
- క్లస్టర్ హెచ్‌ఎంలకు అధికారాలు



మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల

మదనపల్లె సిటీ: విద్యాశాఖకు సంబంధించి పాఠశాల సముదాయాల స్థానంలో (కాంప్లెక్స్) క్లస్టర్ విధానాన్ని అమలు చేయాలంటే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మదనపల్లె అర్బన్, రూరల్ మండల పరిధిలో 14 కాంప్లెక్స్‌లను 12 క్లస్టర్లుగా ఏర్పాటు చేసేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రతి క్లస్టర్‌కు గ్రామీణ ప్రాంతాల్లో 10 నుంచి 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 10 నుంచి 15 పాఠశాలలను అనుసంధానం చేసేలా విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. క్లస్టర్‌లో 40 నుంచి 50 మంది ఉపాధ్యాయులు సభ్యులుగా ఉంటారు. ఇకపై ప్రతి నెలా పాఠశాల కాంప్లెక్స్ సమావేశాలు కొత్త విధానంలో నిర్వహించనున్నారు. ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ, పాఠశాలల మధ్య విద్య అనుసంధానం, విద్యా వనరుల సామాగ్రి తయారీ, తనిఖీలు, విద్యావ్యవస్థ పర్యవేక్షణ, తదితర కార్యక్రమాలు క్లస్టర్ కేంద్రంగా నిర్వహించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హెచ్‌ఎంలే కీలకం

కొత్త విధానలో క్లస్టర్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు కీలకంగా మారనున్నాయి. మండల యూనిట్‌లో ప్రస్తుతం డీడీఓ అధికారాలు ఎంఈఓలకు ఉండగా... ఇకపై ఈ విధానానికి స్వస్తి పలికి త్వరలో క్లస్టర్ స్కూల్ హెచ్‌ఎంలకు జీతాల పంపిణీ అధికారం బదలాయింపు చేయనున్నారు. ఎంఈఓలు పరిపాలనా సంబంధ అంశాలను మాత్రమే పరిమితంకానున్నారు. క్లస్టర్ స్కూళ్లల్లో ప్రధానోపాధ్యాయులపై ప్రస్తుతం ఉన్న రోజువారీ విధులకు అదనంగా క్లస్టర్ నిర్వహణ భారం పడటంతో పాటు ఎంఈఓలు నిర్వహిస్తున్న డీడీఓ బాధ్యతలను కూడా క్లస్టర్ హెచ్‌ఎంలకే ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

సీఆర్పీల భవిష్యత్తు ప్రశ్నార్థకం

ప్రభుత్వ పాఠశాలల్లో బోధనాంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చే స్కూల్ కాంప్లెక్స్‌లను కూటమి ప్రభుత్వం తగ్గించనుంది. ఈ నేపథ్యంలో క్లస్టర్ రిసోర్సుపర్సన్లను కూడా తగ్గిగించనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పటి వరకు కాంప్లెక్స్‌లో విధులు నిర్వహిస్తున్న సీఆర్పీల భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారనుంది. సీఆర్పీలకు బీఈడీ అర్హత ఉండడంతో గత ప్రభుత్వం క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు (సీఆర్‌ఎంటీ)గా గుర్తింపు ఇవ్వడంతో పాటు మండలంలో ఎక్కడైనా ఉపాధ్యాయులు సెలవులో ఉన్నప్పుడు బోధనకు అంతరాయం లేకుండా వీరు పని చేసేలా చర్యలు తీసుకుంది. ఇప్పుడు క్లస్టర్ విధానం అమలులో వీరి పరిస్థితి రేమవుతుందోనని స్పష్టంగా తెలియరావడం లేదు.

పని సులభతరం



క్లస్టర్ విధానంతో పని మరింత సులభంగా అయ్యే అవకాశాలున్నాయి. ఉపాధ్యాయులు కాంప్లెక్స్‌లో ఎక్కువ మంది ఉండే అవకాశాలు ఉన్నాయి. దీని వలన ఉపాధ్యాయులలో మంచి నైపుణ్యాలు పెరిగి బోధనకు సహకరిస్తాయి. సీఆర్‌ఎంటీలతో సహా మరికొన్ని అంశాలకు సంబంధించి పూర్తి సమాచారం తదుపరి ఉత్వర్వులు రావాల్సి ఉంది.

-ప్రభాకర్‌రెడ్డి, ఎంఈఓ, మదనపల్లె

డ్రైవర్లకు కంటిచూపు ముఖ్యం

– జిల్లా రవాణాధికారి ప్రసాద్


డ్రైవర్లకు కంటిపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మదనపల్లె : వాహనాలు నడిపే డ్రైవర్లకు కంటి చూపు చాలా ముఖ్యమని జిల్లా రవాణాధికారి ప్రసాద్, ఆర్టీఓ అశోక్‌ప్రతాప్‌రావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు–2025లో భాగంగా శనివారం స్థానిక ఆర్టీఓ కార్యాలయంలో డ్రైవర్లకు ఉచిత కంటివైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎంవీఐ శివలింగయ్య ఆధ్వర్యంలో లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యులు దాదాపు 250మందికి పైగా డ్రైవర్లకు కంటిపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాధికారి ప్రసాద్ మాట్లాడుతూ....డ్రైవర్లు కంటి సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాతీయరహదారిపై ప్రమాదాలను నివారించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. కంటిచూపు సమస్యలు ఉన్నా,కళ్లు మసకగా ఉన్న డ్రైవర్లు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. డ్రైవర్లకు కళ్లపరీక్షలు చేసి కళ్లద్దాలు అందిస్తే ప్రమాదాలు తగ్గే అవకాశముందని పేర్కొన్నారు. రహదారి నియమ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ప్రతి ఒక్కరు సీటుబెల్ట్, హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, ప్రమాదాలు తగ్గించడానికి ప్రతి వాహనదారుడు బాధ్యతగా డ్రైవింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు దినేష్‌చంద్ర, శ్రీహరి, ఆర్టీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యమే మానవాళికి శ్రీరామరక్ష


మాట్లాడుతున్న ప్రకృతివనం ప్రసాద్

మదనపల్లె : ప్రకృతి సేద్యమే మానవాళి ఆరోగ్యానికి శ్రీరామరక్ష, దీన్ని ఒక ఉద్యమంలా ప్రతి రైతు చేపట్టాలని ప్రకృతివనం ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని సీఎల్ఆర్‌సీ భవనంలో ఏపీ మాస్ ఆధ్వర్యంలో రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రకృతివ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ప్రకృతివనం ప్రసాద్, ఏట నాగప్రసాద్, ఝూన్సీ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రకృతివనం ప్రసాద్ మాట్లాడుతూ...వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం వల్ల ఆరోగ్యం మీద తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా, భూసారాన్ని దెబ్బ తీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతివిధానంలో రైతుకు పెట్టుబడి తగ్గుతుందని, దిగుబడులు పెరుగుతాయన్నారు. మరోవైపు భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. రైతులకు మాత్రమే మంచి ఆహారం పండిచుకునే అవకాశం ఉందని, కనీసం తినేందుకైనా తక్కువ నేలలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు పండిచుకోవాల్సిందిగా రైతులను కోరారు కార్యక్రమంలో ఏపీ సీఎస్ఎఫ్ బావాజాన్, ఏపీ మాస్ ప్రోగ్రామ్ మేనేజర్ వాసుదేవరెడ్డి, అమరేంద్రుడు, రైతుమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం



సమావేశంలో పాల్గొన్న సంఘాల ప్రతినిధులు

బి.కొత్తకోట: అసంఘటిత రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు ఏకైక మార్గమని ఏఐటీయూసీ ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షులు ఎస్. మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండ్ల స్థలాలు, పక్కా గృహాలు, రేషన్ కార్డులు, పింఛన్లు, పార్కింగ్ స్థలాలు, కూలీల పెంపుదల తదితర సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న క్లైమ్ లను పరిష్కరించాలన్నారు. 50 ఏళ్లు నిండిన కార్మికులకు వద్ధాప్య పింఛన్లు ఇవ్వాలని కోరారు. బి.కొత్తకోటలో జరిగే సీపీఐ వందేళ్ల దినోత్సవాన్ని కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రఘునాథ్, ఎం.అష్రఫ్‌అల్లీ, తంబయ్యశెట్టి, ఎస్.ఆజాద్, రాము, ఆరున్, రమణ పాల్గొన్నారు.

20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

పెద్దమండ్యం: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 31 వరకు పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ విక్రమ్‌రెడ్డి శనివారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో రెండు పశు వైద్య బృందాలు పశు సంపద అధికంగా ఉన్న 22 గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరాలలో ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు పశువులకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశ వ్యాధులకు చేస్తారని తెలిపారు. సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు అదే గ్రామంలో నాటు కోళ్లకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తారని చెప్పారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మట్టి తరలింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు


జేసీబీతో మట్టిని తోడుతున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం: రైతులకు ఉపయోగకరంగా ఉన్న కుంట కట్టకు వేసిన మట్టిని ఓ వ్యక్తి అక్రమంగా తోడేశాడని ఆయుకట్టదారులు అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు శనివారం ఫిర్యాదు చేశారు. ఆయుకట్టదారుల కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని రంగసముద్రం సమీపంలో పంచార్ల కుంట ఉందని, సదరు కుంట వర్షపు నీటితో నిండితే దిగవ భాగాన ఉన్న 20 మంది ఆయుకట్టదారుల పంట పొలాలకు ఉపయోగకరంగా ఉందన్నారు. అయితే బి.కొత్తకోటకు చెందిన ఓ వ్యక్తి మూడు రోజుల క్రితం కుంట కట్ట పటిష్టత కోసం వేసిన మట్టిని జేసీబీతో తోడేసి అక్రమంగా ట్రాక్టర్లలో వారి సొంత పొలానికి తరలించేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాక కుంట కట్ట నామ రూపాల్లేకుండా, రైతుల రాకపోకలు కొనసాగకుండా ఉండేందుకు కుంట తూము నుంచి కాలువ వరకు ఆక్రమించేసి రాతి దూలాలు కూడా నాటేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదేమని ప్రశ్నించిన రైతులపై ఆక్రమణదారుడు భూమి తనదేనంటూ దౌర్జన్యం చేస్తున్నాడని పేర్కొన్నారు. ఈ విషయంపై రెండు రోజుల క్రితం తహసీల్దార్ శ్రీరాములు నాయక్‌కు కూడా ఫిర్యాదు చేయగా సర్వే చేస్తామని హామీ ఇచ్చినట్లు రైతులు ఏర్కొన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి పంచార్లకుంట కట్ట కాలువను సర్వే చేసి న్యాయం చేయాలని కోరారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

పెద్దతిప్పసముద్రం: స్థానిక ప్రభుత్వాసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ మహమూద్ డాక్టర్లకు సూచించారు. శనివారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కమిటీ ఆమోదంతో ఆసుపత్రికి మంజూరయ్యే నిధుల ద్వారా అన్ని మౌలిక వసతులు సమకూర్చుకోవాలన్నారు. వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి సేవలు అందించి మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పురుషోత్తం నాయక్, సీనియర్ అసిస్టెంట్ బాలచంద్ర నాయక్‌లు పాల్గొన్నారు.

ఆర్థిక ప్యాకేజి హర్షణీయం

గుర్రంకొండ: కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధి కోసం రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజి ప్రకటించడం హర్షణీయమని మండల బీజేపీ శాఖ అధ్యక్షులు రామాంజులు అన్నారు. శనివారం గుర్రంకొండలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్రం ప్రకటించిన ఆర్థిక ప్యాకేజితో విశాఖ స్టీల్ ప్లాంట్ దిశ దశ మారబోతోందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను దేశంలో ప్రథమ స్థానంలో నిలిపేందకు కేంద్రప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పడం అభినందనీయమన్నారు. ఆర్థిక ప్యాకేజి ప్రకటించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు భరత్, వరదరాజులు, రమేష్, రెడ్డెప్ప, చలపతి పాల్గొన్నారు.

రీ–సర్వేకు ధ్రువపత్రాలతో హాజరు కావాలి

నిమ్మనపల్లె : మండలంలోని మాచిరెడ్డిగారి పల్లె రెవెన్యూ గ్రామ పరిధిలో ఈనెల 20వ తేదీన ప్రారంభించనున్న రీ సర్వే కార్యక్రమానికి రైతులు సరైన ధ్రువపత్రాలతో హాజరుకావాలని తహసీల్దార్ ధనుంజయులు, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సిరాజుద్దీన్ తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూమి సమస్యలను పరిష్కరించడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని మాచిరెడ్డిగారిపల్లి రెవెన్యూ గ్రామంలో ఈనెల 20వ తేదీ నుంచి రీ సర్వే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. రీ సర్వేలో 16 మంది సర్వేయర్లు నాలుగు బందాలుగా ఏర్పడి గ్రామంలోని భూములను సర్వే చేస్తారన్నారు. రైతులు భూములకు సంబంధించిన రికార్డులు, వన్ బి జిరాక్స్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలతో పాటు 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, భూమి హక్కుదారుల ఫోన్ నెంబరు తో పాటు అధికారులకు అందజేయాలన్నారు. భూమి రీ సర్వే చేయు సమయంలో రైతులు హాజరై సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష


మదనపల్లె : పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి

మదనపల్లె సిటీ: జవహర్ నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష శనివారం మదనపల్లె పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, వివేకానంద మాయబజార్ మున్సిపల్ పాఠశాలలో ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏ సెంటర్‌లో 264 మందికి గాను 233 హాజరయ్యారు. బి సెంటర్‌లో 264 మందికి గాను 239 మంది హాజరయ్యారు. వివేకానంద మున్సిపల్ పాఠశాలలో 227 మంది గాను 197 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థుకు 10.45 నుంచి అనుమతించారు. 11.30 నుంచి 1.30 మధ్య పరీక్ష జరిగింది. హాల్‌టిక్కెట్లు చూసి విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాలను ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తనిఖీలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు సుబ్బారెడ్డి, పురం వెంకటరమణ పర్యవేక్షించారు.

పీలేరులో..

పీలేరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన నవోదయ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు చీఫ్ సూపరింటెండెంట్ నటరాజన్ తెలిపారు. శనివారం నిర్వహించిన నవోదయ పరీక్షకు 305 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 276 మంది హాజరైనట్లు తెలిపారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డి, పరిశీలుకులుగా సుబ్రమణ్యం వ్యవహరించారు.

పంటనష్టం, దారి ఆక్రమణపై ఫిర్యాదు

కలకడ : సాగు పంటకు నష్టం కలిగించడం, దారి ఆక్రమణపై ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కదిరాయచెర్వు పంచాయతీకి చెందిన చిరంజీవి భార్య రాధికకు అదే పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 57లో గ్రామ కంఠం భూమి వారి అనుభవంలో ఉంది. ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆయూష్ యోజన పథకంలో ఇల్లు మంజూరు చేసింది. సదరు ఇంటిని వారి అనుభవంలోని స్థలంలో నిర్మించి ఆ ఇంటికి దారి వారి హక్కుకలిగిన భూమిలో ఉన్నట్లు తెలిపారు.ఆ భూమిలో వారు వులవ పంట సాగు చేయగా అదే గ్రామానికి చెందిన క్రిష్ణ, ఆయన కుమారుడు హరినాథకు హక్కు కలిగి ఉన్నట్లు జేసీబీతో కాలువ తీసి, పంటనష్టం కలిగించారని, వారిపై కలకడ పోలీస్ శాఖ, రెవెన్యూశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. సమస్యపై తహసీల్దార్ పనికుమార్ వివరణ కోరగా ఇరువురి రికార్డులు పరిశీలించి సమస్య పరిష్కారానికి కోసం కృషి చేస్తామన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం

ములకలచెరువు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం ఉద్యమిద్దామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. శనివారం స్థానిక మండల కేంద్రంలో 6వ మహాసభల సందర్భంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చిన కార్మికులతో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్లను అమలు చేస్తున్న విధానంపై మండి పడ్డారు. దీనితో కార్మికులకు వరిగిందేమి లేదని అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వాలు కార్మికుల పరిరక్షణ కోసం పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతే ప్రగతికి తొలిమెట్టు

– స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛదివస్ ప్రారంభం



మదనపల్లె: స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్, డీఎస్పీ తదితరులు, పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మదనపల్లె : పరిసరాల శుభ్రతే ప్రగతికి తొలిమెట్టు అని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ డి.కొండయ్య నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మహిళలతో కలిసి ర్యాలీగా బయలుదేరి అవెన్యూరోడ్, బెంగళూరు బస్టాండ్ మీదుగా అనిబిసెంట్ సర్కిల్‌కు చేరుకున్నారు. మానవహారంగా ఏర్పడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో సామాజిక భాగస్వామ్యంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, టౌన్‌బ్యాంక్ చైర్మన్ ఎస్.విద్యాసాగర్, నాయకులు రామకృష్ణ, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

పీలేరు : పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర బు స్వచ్ఛ దివస్ కార్యక్రమం విధిగా నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ చెత్తా చెదారం , వ్యర్థ పదార్థాలు ఎక్కడ పడితే అక్కడ వేయరాదన్నారు. గ్రామ పంచాయతీ చెత్త సేకరణ వాహనంలో వేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో లతీఫ్‌ఖాన్, పీలేరు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ యుగంధ్, నాయకులు కోటపల్లె బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అమరనాథరెడ్డి, చాపల సూరి, కంచి సూరి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

గుర్రంకొండ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని రాయచోటి డీఎల్‌డీవో లక్ష్మీపతి అన్నారు. శనివారం మండలకేంద్రమైన గుర్రంకొండలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర అన్న కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించి బస్టాండులో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో వెంకటేశులు, ఏట నాగశివారెడ్డి, ఈవోపీఆర్‌డీ బ్రహ్మానందరెడ్డి, మండలవైద్యాధికారి రవీంద్రనాయక్, ఎంఈవోలు సుబ్రమణ్యం, సురేంద్రబాబుద, ఎవో రత్నమ్మ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ రెడ్డెమ్మకొండలో:

మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మకొండ ఆలయపరిసరాల్లో శనివారం రాయచోటి దేవాదాయశాఖ అధికారి శశికుమార్ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాల్లోని అమ్మవారి పుష్కరిణి పరిసరాల్లో పచ్చిమొక్కలను, చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు.

కేవీపల్లెలో..

కేవీపల్లె : పరిసరాల పరిశభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉండగలరని తహసీల్దార్ క్రాంతికుమార్, ఎంపీడీవో సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని గర్నిమిట్టలో స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. మానవహారం నిర్వహించి పారిశుద్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో రెడ్డిబాషా, ఏవో శ్రావణి, అధికారులు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో..

పెద్దమండ్యం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోనే ప్రతి ఒక్కరు మంచి ఆరోగ్యాన్ని పొందుతారని జిల్లా గృహ నిర్మాణశాఖ పీడీ, మండల ప్రత్యేక ఆధికారి సాంబశివ అన్నారు. పెద్దమండ్యంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పెద్దమండ్యం పురవీధులలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్‌రావు, గ్రామ సర్పంచ్ సోదనపల్లె బాషా, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ అశోక్‌కుమార్, హౌసింగ్ ఏఈ అక్రమ్, సీనియర్ ఆసిస్టెంట్ నాగేంద్రవరప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఏఈలు బాలచందర్, శ్రీనివాసులు, ఏపీఎం హరి, ఏపీవో తిరుపాలప్ప, ఏవో ప్రేమలతతో పాటు అంగన్‌వాడీలు, పారిశుద్య కార్మికులు పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన నిమ్మనపల్లిలో ఎంపీడీవో కార్యాలయం నుంచి వివిధ శాఖల సిబ్బందితో కలసి మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాపులమ్మ, ఏవో రమేష్ బాబు వ్యవసాయ అధికారి మురళీమోహన్ ఎంఈఓ పద్మావతి పాల్గొన్నారు.

రామసముద్రంలో..

రామసముద్రం : మండల కేంద్రంలో ఎంపీపీ కుసుమకుమారి, ఎంపీడీవో భానుప్రసాద్, ఎంఈఓ హేమలత, ఏపీఎం సాంబశివ, మెడికల్ ఆఫీసర్ లీల, ఏవో మోహన్ కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, సచివాలయ సిబ్బంది, పారిశుద్ధ కార్మికులు మండల కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ సర్కిల్‌లో మానవ హారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: అందరి సహకారంతో పరిశుభ్రమైన ఆస్పత్రిగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ తేజస్వి అన్నారు. శనివారం సీహెచ్‌సీలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిశుభ్రతపై చేపట్టాల్సిన అంశాలను వివరించారు.ఆస్పత్రిని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అమరసింహ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై ..

బి.కొత్తకోట: మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ పై శనివారం అధికార యంత్రాంగం స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. కొండపై ర్యాలీ నిర్వహించిన అనంతరం నగర పంచాయతీ కార్మికులతో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. చెత్తాచెదారం, మద్యం బాటిళ్లను తొలగించారు. గాలిబండను శుభ్రం చేశారు. ఏపీ టీడీపీ చైర్మన్ నూకసాని బాలాజీ ర్యాలీలో పాల్గొని పారిశుధ్య నిర్వహణపై సూచనలు చేశారు. కమిషనర్ పల్లవి, తహసీల్దార్ మొహమ్మద్ అన్సారి, ఎంపీడీవో మంగళం శంకరయ్య, మేనేజర్ రమాదేవి, టూరిజం మేనేజర్ నేదురుమల్లి సాల్విన్ రెడ్డి, ఆర్.మహేష్ పాల్గొన్నారు. అలాగే అటవీశాఖ ప్రాంగణంలో సెక్షన్ ఆఫీసర్ అడపా శివకుమార్, సిబ్బంది స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రాంగణంలో చెత్తను తొలగించి పర్యాటకులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే బి.కొత్తకోటలో నగర పంచాయతీ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా జ్యోతి చౌక్ చేరుకుని అక్కడ మానవ హారం నిర్వహించారు.

క్లుప్తంగా

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు

మదనపల్లె సిటీ: స్థానిక ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు ఈనెల 23వతేదీన నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రమణ తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి భక్తులు హాజరు కావాలని కోరారు.

పింఛన్లు తనిఖీ

పెద్దమండ్యం: మండలంలోని కలిచెర్ల, కోటకాడపల్లె, ఎన్‌వోపల్లె గ్రామ సచివాలయాల పరిధిలో డీఎంహెచ్‌వో పింఛన్లు రూ.15 వేలు పొందుతున్న లబ్ధిదారులను డాక్టర్లు తనిఖీ చేశారు. ప్రభుత్వం నిబంధనల మేరకు లబ్ధిదారుల వికలత్వంపై డాక్టర్లు ప్రతి ఒక్కరిని పరీక్షించారు. అలాగే వికలత్వ సర్టిఫికెట్స్‌ను పరిశీలించి, ఏ ప్రాంతంలో వాటిని పొందారనే విషయంపై ఆరా తీశారు. కార్యక్రమంలో కడప రిమ్స్ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫసర్లు జ్యోత్స్న, సి భాస్కరరావు, ఎంపీడీవో శ్రీధర్ రావు, పిహెచ్‌సీ డాక్టర్ ఇమ్మాన్యుయేల్, పంచాయతీ కార్యదర్శి ఖాదర్‌బాషా, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని రైతుకు తీవ్ర గాయాలు

మదనపల్లె: కారు ఢీకొని రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు పంచాయతీ అడవిపల్లికి చెందిన రైతు క్రిష్టారెడ్డి (66) పొలం పనుల కోసం జెసీబీ బాడుగకు మాట్లాడేందుకు ముదివేడు క్రాస్‌కు వచ్చాడు. రోడ్డుపక్కన జెసీబీ డ్రైవర్‌తో మాట్లాడుతుండగా మదనపల్లె నుంచి కడపవైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో క్రిష్టారెడ్డి తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాలపై కేసులు

బి.కొత్తకోట: మండలంలోని బడికాయలపల్లెలో పాల చంద్రశేఖర్, తెట్టు మారెప్ప వర్గాల మధ్య జరిగిన ఘర్షణపై కేసులు నమోదు చేశామని శనివారం పోలీసులు తెలిపారు. రెండు వర్గాల మధ్య పాతకక్షల కారణంగా చోటుచేసుకున్న గోడవలపై పరస్పరం ఫిర్యాదులు చేసుకోగా కేసులు నమోదు చేశారు.

ఏఓగా కేఎన్ నిత్యానంద్

పెద్దతిప్పసముద్రం: స్థానిక మండల పరిషత్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి (ఏఓ)గా నియమితులైన నిత్యానంద్ శనివారం బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. ఈయన గతంలో చిత్తూరు జిల్లా పరిషత్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈయన వచ్చే నెల 28న పదవీ విరమణ పొందనున్నారు. ఇక్కడ ఏవోగా ఇటీవల పని చేసిన జ్యోతిలత సైతం ముచ్చటగా రెండు నెలలు పని చేసి పదవీ విరమణ చేశారు.

కోటమిట్ట ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

కలకడ : మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీలో వెలసిన కోటమిట్ట ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రవీంద్ర తెలిపారు. పౌర్ణమి, పాద్యమి సందర్భంగా స్వామివారికి అభిషేకం, ఆకు పూజ నిర్వహించి ఆలయానికి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

శ్రీలక్ష్మీనరసింహుడికి విశేషపూజలు


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు చేశారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని పలురకాల రంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

'స్మార్ట్ మీటర్లపై అపోహలు వద్దు'

పీలేరు : ప్రతి ఇంటికి ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లపై వినియోగదారులు ఎలాంటి అపో హలు చెందాల్సిన అవసరం లేదని ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు కాలిపోవడానికి ఆస్కారం ఉండదని తెలిపారు. స్మార్ట్ మీటర్లకు 10 సంవత్సరాలు గ్యారంటీ ఉంటుందని చెప్పారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే ట్రాన్స్‌కో సిబ్బందికి తెలియజేస్తే తక్షణం కొత్త స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్మార్ట్ మీటర్లు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరంలేదని తెలిపారు.